క్లుప్తంగా

నేడు యద్దనపూడిలో స్పందన

యద్దనపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలకు సంబంధించి అర్జీలు అందజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు మార్టూరు మండల సమావేశం

మార్టూరు: మార్టూరు మండల సర్వ సభ్య సమావేశం 14 వతేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ నితిన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశం భవనంలో ఎంపీపీ భూక్యా శాంతిబాయి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

కొప్పరపాడుకు నూతన పీహెచ్‌సీ మంజూరు

బల్లికురవ: మండలంలోని కొప్పరపాడు గ్రామానికి ప్రభుత్వం నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 20 సచివాలయాలతో పాటు, మార్టూరు మండలంలోని వలపర్ల ఒకటి, రెండు సచివాలయాలు కూడా గుంటుపల్లి పీహెచ్‌సీ పరిధిలోనే ఉన్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో వైద్యం అనే విధంగా కొప్పరపాడు పీహెచ్‌సీని మంజూరు చేశారని చెప్పారు. పది సచివాలయాల్లోని ప్రజలతోపాటు మేదరమెట్ల, నార్కెట్‌పల్లి నామ్ రహదారిలో ప్రమాదాలు సంభవించిన సమయంలో కొప్పరపాడు పీహెచ్‌సీలో అత్యవసర చికిత్స అందించనున్నట్లు వైద్యాధికారి చెప్పారు.

ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలి

చీరాల రూరల్: చిన్నారులకు చిన్ననాటి నుంచి చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవరచుకున్నట్లయితే మంచి పౌరులుగా ఎదుగుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ చర్చిలో సండే స్కూలు చిన్నారులకు చిల్డ్రన్స్ రీట్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బైబిల్ గ్రంథంలోని అంశాలను క్రోడీకరించి క్విజ్ పోటీలు, దేవుని గీతాలాపన పోటీలు నిర్వహించారు. విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముందుగా సంఘ కాపరి రెవరెండ్ గోదా చంద్రకాంత్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుడి వాక్య సందేశాలు అందించారు. చిన్నారులను క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం చర్చిలో జరిగే సండే స్కూలు కార్యక్రమాలకు పంపించి దేవుని సన్నిధిలో మంచి పౌరులుగా ఎదిగేలా పెద్దలు, తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సండేస్కూలు ప్రతినిధులు, టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు

బల్లికురవ: రైతుల గ్రూపులకు నలభై శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి ఆదివారం తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ.15 లక్షల వరకు పరికరాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఇందులో రైతు వాటాగా 10 శాతం చెల్లిస్తే, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ లోన్‌తో దఫాల వారీగా చెల్లించవచ్చని చెప్పారు. మండలంలోని 20 ఆర్బీకేల్లో 13 ఆర్బీకేల పరిధిలో యాంత్రీకరణ యూనిట్లను ఇప్పటికే అందించామన్నారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, అంబడిపూడి, వైదన, కొప్పరపాడు, వెలమవారిపాలెం గ్రామాల్లోని రైతు గ్రూపులు యాంత్రీకరణ యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు

అద్దంకి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని యూటీఎఫ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీనివాసా కళ్యాణమండపంలో ఆదివారం బాపట్ల జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ శ్రీనివాసరావు, పీ హరిబాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బాబూరావు, అద్దంకి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఈ రామారావు, బీ పూర్ణచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

వైట్ బర్లీ.. ధరలు మెరిసి


ఆదిపూడి రోడ్డులో కోత కోసి ఎండిబెట్టిన వైట్ బర్లీ పొగాకు పంట


పర్చూరు రోడ్డులో రెండో కోతకు సిద్ధంగా ఉన్న వైట్‌బర్లీ సాగు

- రైతన్నకు సిరుల పంట వైట్ బర్లీ
- ఆశాజనకంగా దిగుబడులు, ధరలు
- లాభాలకు ఢోకా లేదంటున్న రైతులు

కారంచేడు: ఉమ్మడి ప్రకాశం జల్లాలో వాణిజ్య పంట పొగాకుకు దేశవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. ఈ ఏడాది అన్నదాలకు తమ భూములు సిరుల పంటలు పండిస్తున్నాయి. పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడు, చినగంజాం మినహా ఇంకొల్లు, యద్దనపూడి, పర్చూరు, మార్టూరు మండలాలు ఎక్కువగా మెట్ట పైర్ల సాగు ఉంటుంది. కారంచేడు, చినగంజాం మండలాల్లో అధికంగా వరి సాగు చేస్తుంటారు. మాగాణి రైతులతో పాటు, మెట్ట పైర్లు సాగు చేసే రైతుల్లోను ఈ ఏడాది పంటల దిగుబడులు, మంచి గిట్టుబాటు ధరలు అన్నదాతల ఆనందానికి అవధులు లేకుండా చేస్తున్నాయనడంలో అతిశయోక్తికాదు. అనుకూల వాతావరణంతో పాటు, పంట కాలువల్లో సమృద్ధిగా ఉన్న సాగు నీటితో ఈ ప్రాంత సాగు భూములు పంటలతో కళకళలాడుతున్నాయి. వాణిజ్య పంట పొగాకుకు ఈఏడాది బాగా కలిసి వచ్చే అవకాశం ఉంది. వైట్ బర్లీ పొగాకు మంచి గిట్టుబాటు ధరలు..

గతేడాది వైట్ బర్లీ సాగు చేసిన రైతులు అధిక వర్షాలతో పంటలు నష్టపోయి, కొంత మందికి కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు ఎదుర్కొన్నారు. అయితే ఈ ఏడాది వైట్ బర్లీ సాగు చేసిన రైతులు మాత్రం సంతోషంగా ఉన్నారు. కారణం పెట్టుబడులు పోను, లాభాలు గడించడమే. ఈ ప్రాంతంలో ఎకరాకు సుమారు రూ 40–50 వేల పెట్టుబడులు అయ్యాయి. అయితే గత ఏడాది ఎకరానికి 10–13 కింటాళ్ల దిగుబడులు వస్తే, ఈ ఏడాది అనుకూల వాతావరణంతో 15–20 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతుల అంచనా. ఇక ధరల విషయానికి వస్తే గతేడాది మొదట్లో రూ.2500 తరువాత రూ.4000 వరకు వచ్చింది. అయితే ఈ ఏడాది సుమారు రూ.6000 నుంచి రూ.7000 వరకు ధరలు పలుకుతున్నాయి. దీంతో ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడులు అయినా, సుమారు రూ.1 లక్ష వరకు గిట్టుబాటు ధరలు వస్తే, పెట్టుబడులు పోను మరో రూ.50 వేల వరకు మిగులు ఉండే అవకాశాలున్నాయని రైతులు చెప్తున్నారు.

నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	ఎకరాలు (సుమారుగా)
పర్చూరు	3900
కారంచేడు	600
ఇంకొల్లు	1050
యద్దనపూడి	1640
చినగంజాం	200
మార్టూరు	210

ఈ ఏడాది మంచి దిగుబడులు..
ఈ ఏడాది వైట్‌బర్లీ సాగులో రైతులకు పెద్దగా ఇబ్బందులు లేవనే చెప్పాలి. గతేడాది అధిక వర్షాలు, తుఫాన్‌లతో పంటలు చాలా దెబ్బతిన్నాయి. ఒకటికి రెండు సాగు నాట్లు వేసుకోవాల్సి వచ్చింది. అయినా దిగుబడులు ఆశించినంత రాలేదు. దీంతో కొంత నష్టపోయారు. ఈ ఏడాది మాత్రం ఊహించినదాని కంటే కూడా మంచి దిగుబడులు వచ్చాయి. దీంతో రైతులు చాలా ఆనందంగా ఉన్నారు.
– ఏ వెంకటేశ్వరరావు, రైతు, ఆదిపూడి

మంచి గిట్టుబాటు ధరలున్నాయి..
దేవుడి దయతో అనుకూల వాతావరణంలో పంట బాగా ఉంది. మంచి దిగుబడులు వస్తున్నాయి. దీనికి తోడు ప్రభుత్వ అండతో మంచి గిట్టుబాటు ధరలు పలుకుతున్నాయి. గత ఏడాది రూ.4000 ఉంటే అదే పంట ఈ ఏడాది రూ. 7000 ఉంటుంది. పెట్టుబడులకు ఢోకాలేదు. మంచి లాభాలు కూడా వస్తాయనే ఆశతోనే ముందుకు వెళ్తున్నాం.
– ఎం సుబ్బారావు, రైతు, తిమిడెదపాడు

రామమందిర శ్లాబ్ నిర్మాణానికి శంకుస్థాపన


పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: మండలంలోని శింగరకొండ క్షేత్రంలోని రామందిర శ్లాబ్ నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేశ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, నాయకుడు చౌదరిబాబు, మందిర కమిటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం


ఆమంచిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

యద్దనపూడి: వైఎస్సార్ సీపీలో ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచితస్థానం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం రాత్రి రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో యద్దనపూడి గ్రామంలోని సూమారు 200 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పందిళ్లపల్లి లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమంచి మండలంలో ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుకా బాలకోటేశ్వరావు, నల్లపునేని వీరేంద్ర, జాగర్లమూడి సుబ్బారావు, జాగర్లమూడి శ్రీను, నల్లపునేని లక్ష్మయ్య, గుంజి పుల్లారావు, వల్లెపు వెంకట్రావు, అంకమ్మ, షేక్ ఖరీమ్, జానీ, అక్బర్‌వలి, కవల నాగరాజు, కొమ్మాలపాటి శ్రీను, రేటూరి గంగయ్య, దావల పిచ్చియ్య, గర్నెపూడి డేవిడ్, జిల్లెలమూడి హరిబాబు, యలగాల సుబ్బయ్య, కఠారి వెంకయ్య, పరుచూరి నాగయ్య, యద్దనపూడి సాంబయ్య, బొబ్బేపల్లి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జననం లోకానికి రక్షణ


దైవ సందేశం ఇస్తున్న రెవరెండ్ ఫాదర్ థామస్


విద్యుత్ దీపాల కాంతిలో లూర్థుమాత దేవాలయం

కారంచేడు: లోకరక్షణకే ప్రభువైన ఏసుక్రీస్తు లోకంలో కన్య గర్భమున జన్మించారని రెవరెండ్ ఫాదర్ పూదోటి థామస్ అన్నారు. మండల కేంద్రమైన కారంచేడు అంబేడ్కర్ కాలనీ సమీపంలో నెలవైన లూర్దు మాత దేవాలయ ఉత్సవ తిరునాళ్లు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 9వ తేదీ నుంచి విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాల మాదిరిగానే ఈ ప్రాంతంలో కారంచేడులో మరియమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకములు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే కారంచేడులో నిర్వహించిన ఈ ఉత్సవ తిరునాళ్లకు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన అనేక మంది చర్చిల ఫాదర్లు ప్రార్థనలకు హాజరై దైవసందేశాన్ని ఇస్తుంటారు. శనివారం అర్థరాత్రి వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్‌ఫాదర్ థామస్ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ అనిల్ బోస్కో, ఫాదర్లు మిఖాయిల్, రాజు, కరుణాకర్, ఏసురత్నం, ఇన్నసారి, మేఘు, కొనకశేఖర్, మనోజ్, సాగర్‌సంతోష్, అనేక ప్రాంతాలకు చెందిన సిస్టర్స్, క్రైస్తవులు, భక్తులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

చీరాల అర్బన్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారిణి జె.రాజ దెబోరా అన్నారు. ఆదివారం చీరాల పరిసర ప్రాంత సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రేరణా తరగతులను నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ళలో పదోతరగతి విద్యార్థులకు శారీరక, మానసిక ఉత్తేజాన్ని పెంపొందించి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారిణి యువస్వరూప, రిసోర్సు పర్సన్లు పవని భానుచంద్రమూర్తి, ఎల్.శ్రీను, శివప్రసాద్, శ్రీనివాసరావు, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓవ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం మార్టూరులో చోటు చేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ వివరాల మేరకు.. జే పంగులూరు మండలం బైటమంజులూరు గ్రామానికి చెందిన తాతపూడి రవికుమార్ చిలకలూరి పేట నుండి స్వగ్రామం వెళుతున్న సమయంలో స్థానికం ఇంటూరి ఫంక్షన్ హాలు ఎదురు రహదారిపై బైకు చైను తెగి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి రవికుమార్ గాయపడ్డాడు. తలకు గాయమైన రవికుమార్‌ను 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

చీరాల అర్బన్: విద్యుత్ తీగలు తగలడంతో ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి దగ్ధమైన ఘటన ఆదివారం సంపత్‌నగర్ వద్ద చోటుచేసుకుంది. సుమారు మూడు ఎకరాల వరిగడ్డిని ఆదివారం తీసుకెళ్తుండగా సంపత్‌నగర్ కాలనీ వద్ద విద్యుత్ తీగలు వరిగడ్డికి తగలడంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ.25 వేలు నష్టం వాటిల్లించగా ఈ మేరకు వివరాలు నమోదు చేసుకున్నారు.

అభివృద్ధి పనులకు విరాళం అందజేత

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖపుణ్య క్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అనంతపురం జిల్లా గుత్తికి చెందిన మద్దినేని సంతోష్ రూ.70 వేల ఆదివారం విరాళంగా అందజేశారు. విరాళాన్ని ఆయన ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఏసీ సుభద్రకు అందజేశారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి


మాట్లాడుతున్న ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు వెంగళరావు

చినగంజాం: మహిళలను కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించిన వ్యక్తిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేయాలని దళిత గిరిజన సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చినగంజాం గ్రామం ఎస్సీ కాలనీలో నివాసముంటున్న కట్టా శ్రీనివాసరావుకు ప్రభుత్వం 4.50 ఎకరాల భూమిని ఇచ్చారని, ఆ భూమిలో మామిడి, జామాయిల్ సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని భూమిపై కన్నేసిన కడవకుదురు గ్రామానికి చెందిన గున్నమనేని ప్రతాప్‌కుమార్, మరో నలుగురు వ్యక్తులకు డబ్బులిచ్చి మద్యం పోయించి ప్రలోభానికి గురిచేసి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. ఆ భూమి తన పూర్వీకులదని వారిని ఆ భూమిలో అడ్డుకుంటే కొంత డబ్బు ఇస్తానని వారికి ఆశ చూపి మొక్కలను నరుకుతుండగా సమాచారం తెలుసుకున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని ప్రతాప్ కుమార్ కులం పేరుతో దూషించి మహిళలు అని కూడ చూడకుండా వారిపై దాడి చేసి చంపుతామని బెదిరించిన ప్రతాప్‌కుమార్ అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు జగన్నాథం రామారావు, దళిత హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ముప్పవరపు గోపి, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

అందె కస్తూరిబాయికి ఘన నివాళి


కస్తూరిబాయి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కరణం


అందె చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల: చీరాల మున్సిపాలిటీ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అందె కస్తూరిబాయి ఇటీవల మరణించగా ఆదివారం జరిగిన దశదిన కర్మకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ అందె నరసింహారావు, అవ్వారు ముసలయ్య, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలానే వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, పోతుల సురేష్‌లు కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుబ్బారావు మృతికి పలువురి సంతాపం


సుబ్బారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బత్తుల


నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్

పర్చూరు: మండల కేంద్రమైన పర్చూరుకు చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ లింగిశెట్టి సుబ్బారావు మృతి చెందగా, మృతుని కుటుంబ సభ్యులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, సహకార మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడు సుబ్బారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. మండల కన్వీనరు కఠారి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోకల కృష్ణమోహన్, యద్దనపూడి హరిప్రసాద్, అడపా సుధాకరరెడ్డి, పులి శంకర్, లంకా శివ, ఒగ్గిశెట్టి శివనాగప్రసాద్, పర్చూరు ఉపసర్పంచ్ గాదె సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ పోలూరి శివారెడ్డి, ఆదిపూడి సొసైటీ అధ్యక్షులు యర్రం లక్ష్మారెడ్డి, క్రిష్ణంశెట్టి రమేష్, దాసరి వెంకటరావు, ఆకుల మధు, భవనం రాజగోపాలరెడ్డి, కంచనపల్లి రమేష్, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


పెన్నులు, అట్టలు జామెట్రీలు పంపిణీ చేస్తున్న రోటరీ అధ్యక్షుడు

అద్దంకి: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వారికి ఉపయోగకరమైన అట్టలు, జామెట్రీలు, పెన్సిల్స్, పెన్నులను రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఆదివారం పట్టణంలోని సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహంలోని 90 మంది విద్యార్థులకు పాత శివాలయం సమీపంలోని లక్ష్మయ్య సేవా సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అడుసుమల్లి వెంకటేశ్వర్లు సౌజనయతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సాధికారిత అధికారి రాజదెబోరా, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్లాక్లిన్, రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీ కృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, రోటరీ సభ్యులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పీ. సుశీలాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు తమ అవసరాలపై అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

అద్దంకి: పుస్తక పఠనంతో విజ్ఞాన కలుగుతుందని సంతమాగులూరు లైబ్రేరియన్ గ్రంథపాలకుడు భాస్కరరెడ్డి అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రంథాలయంలో విద్యార్థులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకుల చరిత్ర పుస్తకాలు, కథల పుస్తకాలు, మాస, దిన పత్రికలను వారిచేత చదివించారు. పఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం


బొనిగల మధు


పూర్ణ

మేదరమెట్ల: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కొరిశపాడు మండల కన్వీనర్‌గా బొనిగల మధును నియమించారు. అలాగే కో-కన్వీనర్‌లుగా జీ.శివకృష్ణ, మన్నె వేణు, చింతాజాన్, గొల్ల సురేష్‌లను నియమించారు.

కారంచేడు: వైఎస్సార్ సీపీ కారంచేడు మండల కమిటీని నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జాబితాలు విడుదలయ్యాయి. మండల కన్వీనర్‌గా కుంకలమర్రు గ్రామానికి చెందిన రావూరి పూర్ణ, మండల కో-కన్వీనర్లుగా గొర్రెముచ్చు సురేంద్ర, చల్లా చలమారెడ్డి, యార్లగడ్డ శ్రీకాంత్, వల్లమూడి రాజేష్‌లు ఎంపికయ్యారు.

చురుకుగా రామాలయ నిర్మాణం

బల్లికురవ: మండలంలోని అంబడిపూడి గ్రామంలో సీతారామలయ నిర్మాణం చురుకుగా జరుగుతోంది. గ్రామ కూడలిలో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం పల్లంలో ఉండటంతోపాటు జీర్ణావస్థకు చేరి కూలే దశకు చేరింది. గ్రామాలకు చెందిన యువకులు ఉద్యోగాలలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన యువకులంతా పునఃనిర్మించాలని సంకల్పించారు. ఇందుకోసం రూ. 60 లక్షల అంచనాలతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ. 25 లక్షల విరాళాలను సేకరించారు. పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఆరు నెలలో నిర్మాణ పనులు పూర్తిచేసి సీతారామలక్షణ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు యూత్ సాక్షికి తెలిపారు.


నిర్మాణంలో ఉన్న సీతారామాలయం

18న బ్రహ్మకుండం వద్ద అభిషేకాలు

బల్లికురవ: మహాశివరాత్రి సందర్భంగా కొణిదెన బ్రహ్మకుండం వద్ద నాగలింగేశ్వర స్వామికి అభిషేకాలు, శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిషేకాల తరువాత శివపార్వతుల కళ్యాణం, రాత్రికి జాగరణ, చేపట్టనున్నట్లు చెప్పారు. ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మకుండం వద్ద వెలసిన నాగలింగేశ్వరుని దర్శించుకుని వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ నీరజ

వేటపాలెం: పందిళ్లపల్లిలోని గంగా పార్వతి సమేత పునుగు రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణలోని కల్యాణ మండపంలో మణికంఠ సేవా సమితి సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుంటూరు నీరజ న్యూరో కేర్ వైద్యశాల డాక్టర్ కోటి నీరజ, సీతారం, గాయిత్రిలు 300 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రవీణ్, మణికఠా సేవా సమితి సభ్యులు పోలకం శేఖర్, గుమ్మడి సుశీల పాల్గొన్నారు.